# దయ్యాన్ని పట్టిన మనిషి



"ఒరేయ్... ఇల్లంటే మీ ఇంటిలాగా ఉండాలిరా! ఇంతపెద్ద సిటీలో ఆఫీసుకి ఇంత దగ్గర్లో ఇల్లు దొరకడం ఎంత అదృష్టంరా! బస్సుకి పైసా ఖర్చు పెట్టాల్సింది లేదు. సైకిల్ తొక్కే ఆయాసం కూడా లేదు. గుమ్మంలో నుంచుని మీ ఆవిడ గట్టిగా కేకేసిందంటే, నీ సీటుకి వచ్చి వినిపిస్తుంది"

- అంటూ సుబ్బారావు ఇంటిని చూసి మరీమరీ మురిసిపోసాగాడు మురళి.

"అబ్బబ్బ... మరీ అంత పొగడకురా- దిష్టి తగిలేను! నీ దిష్టి తగిలి మా ఇంటాయన ఇల్లు ఖాళీ చేయమన్నాడంటే నీ ప్రాణానికి ఉసూరుమని ఏడవవలసి వస్తుంది" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

"మరి.., నా దిష్టి తగలకుండా ఉండాలంటే నీ ఇంటికి దగ్గరే ముందో, వెనకో, పక్కనో నాకు కూడా ఒక ఇల్లు చూడు!" అన్నాడు మురళి నవ్వుతూనే.

"నేనేమైనా చూడనన్నానా... నాతో చెప్పకుండానే, ఆఫీసులో కొత్త పోస్టులో జాయిన్ అవకుండానే, కొంపలు మునిగినట్లు ముందే ఇల్లు చూసుకుని మరీ ఊరికి వచ్చావుకదురా నాయనా! నేనేం చేయను?" అన్నాడు సుబ్బారావు.

"అవునురా... పొరపాటే జరిగిపోయింది. ఈ ఊరికి బదిలీ అవగానే మా బావమరదికి ఇల్లు చూడమని ఉత్తరం రాశాను. వారం తిరక్కుండానే ఇల్లు చూసి, నా తరపున అడ్వాన్స్ ఇచ్చి ఖాయం చేసుకుని మరీ ఉత్తరం రాశాడు. ముందు ఏదో ఇల్లంటూ చూసుకుని అందులో వాలితే అవసరమైతే ఆ తర్వాత మారవచ్చు ననుకున్నాను. అందుకే ఒకేసారి సతీ, సుత, సామాను సమేతంగా వచ్చేశాను" అన్నాడు మురళి.

"అదిసరే. ఇప్పుడు నువ్వున్న ఇల్లు బాగా లేదా?" అని అడిగాడు సుబ్బారావు.

"రాజును చూసిన కళ్లతో మొగుణ్ని చూస్తే మొత్తబుద్ధయింది అంటారు చూడు- నీ ఇల్లు చూడనంతవరకూ మా ఇల్లు బాగానే ఉంది. నీ ఇల్లు చూశాక అన్నీ ఇబ్బందులే కనిపిస్తున్నాయి!"

"ఏమిటా ఇబ్బందులు?"

"ఆఫీసుకీ, మా ఇంటికీ నాలుగు మైళ్ల దూరం! రానుపోను బస్సులకి ఖర్చు. ఆ బస్సులకోసం కూడా రోజూ శవ జాగరణ! పైగా... ఏ వస్తువు కావలసినా మైలుదూరం పోవాలి. వాటికోసం మళ్లీ రిక్షా ఖర్చు! ఇవన్నీ కలుపుకుంటే ఆ డబ్బుకి బహుశా ఈ ప్రాంతంలోనే నీలాగే మంచి ఇల్లు దొరకవచ్చు" అన్నాడు మురళి.

"నువ్వు చెప్పింది నిజమే! ఈ విషయం దృష్టిలో ఉంచుకుంటాను. ఈసారి మా దగ్గర్లో మంచి ఇల్లేదైనా ఖాళీ అయితే నీకు తప్పక చెప్తాను. మా ఆవిడతో కూడా చెప్తాను. అసలు నీకు ప్రాప్తం లేకపోయింది కానీ, మొన్ననే మా ఎదురిల్లు ఖాళీ అయిందిరా... నిన్ననే కొత్తవాళ్ళు దిగారు. మా ఇంటిని చూసే ఇంత మురిసిపోతున్నావు- ఆ ఇల్లు చూసుంటే అన్నం మానేసి అక్కడే కూర్చుండిపోయేవాడివి. కాస్తంత ముందు చెప్పి ఉంటే నీకు తప్పక ఇప్పించి ఉండేవాడిని. ఆ ఇంటాయన కూడా మహామంచివాడు. ఏమి ఇల్లురా అది!" అంటూ ఊరించసాగాడు సుబ్బారావు.

ఆ మాటలు వింటుంటే మురళికి మతిపోయినంత పనయ్యింది. తన నోటి ముందున్న సిద్ధాన్నాన్ని ఎవరో తన్నుకుపోయినట్లు అనిపించింది. బుర్ర వేడెక్కిపోయింది. సుబ్బారావు డాబా మీదనుంచి ఆ ఇంటిని చూశాడు.

ఇల్లు చిన్నదే కాని, ఎంతో అందంగా ఉంది. చుట్టూ చిన్న కాంపౌండ్, మధ్యన ఆర్.సి.సి. ఇల్లు అందమైన రంగులతో కళకళలాడుతోంది. ఆ ఇంటి రూపురేఖలు చూసినా, కాంపౌండ్‌లో పెద్దచెట్లు లేకుండా చిన్న చిన్న పూలమొక్కలు చూసినా ఆ ఇంటిని కట్టి ఎక్కువ కాలం కాలేదనిపిస్తోంది. బయటనుంచి చూస్తేనే ఇంటి లోపల కూడా ఎంతో అందంగా, సౌకర్యంగా ఉంటుందనిపిస్తోంది.

దానిని అలా చూస్తుంటే మురళి గుండె అంతకంతకూ బరువు కాసాగింది.

ఆ ఇంటివంక చూస్తూ బరువుగా నిట్టూర్చి, "ఏరా... ఈ ఇల్లు కొత్తగా కట్టినట్లుంది!" అన్నాడు.

"అవునురా... గట్టిగా ఏణ్ణర్ధం కాలేదు. ముందు అక్కడో పాత ఇల్లు ఉండేది. దానిని కొని, పడగొట్టి ఈ ఇంటిని కట్టాడు పరంధామయ్యగారు. మంచి ఇండిపెండెంట్ హౌస్!" అన్నాడు సుబ్బారావు.

"ఇప్పుడున్న వాళ్ళు అద్దెంత ఇస్తున్నారు?" మరో ప్రశ్నాస్త్రాన్ని సంధించాడు మురళి.

"ఎక్కువేం కాదు. ఎనిమిది వందలు!"

"నాట్ ఎటాల్ బాడ్! ఇంకా మాట్లాడితే డెడ్ ఛీప్ అంటాను. దిక్కుమాలిన ఆ మూలన నేను ఆరు వందలు ఇస్తున్నాను. బస్సులకీ, రిక్షాలకీ మరో రెండు వందలుపైనే తగలేస్తున్నాను. ఒరేయ్! మనం మరో వంద ఎక్కువిస్తే వీళ్ళని ఖాళీ చేయించి మనకిస్తాడేమిరా ఆ పరంధామయ్యగారు?" అన్నాడు మురళి ఆశగా.

"అటువంటి పిచ్చి ఆశలు పెట్టుకోకు. పరంధామయ్యగారు చాలా పెద్దమనిషి. డబ్బుకి కక్కుర్తి పడే రకం కాదు. అద్దెకున్నవాళ్ళని సొంతవాళ్ళకింద చూసుకుంటాడు."

"ఒరేయ్... నువ్వు చెప్తున్న మాటలు వింటుంటే నాకు ఏడుపు వస్తోందిరా! పోనీ.., ఒక్కసారి పోయి ఆ పరంధామయ్యగారిని పలకరించి కాసేపు ఆమాటా ఈమాటా మాట్లాడి వద్దాం రారా... ఆయనతో పరిచయం అయినట్లూ ఉంటుంది" అన్నాడు మురళి- మనసులో పరంధామయ్యగారిని బోల్తా కొట్టించలేకపోతానా... అని ఆలోచిస్తూ.

"అయ్యో రాత... నీకన్నీ నిరాశలే ఎదురవుతున్నాయిరా! ఆయన ఈ ఇంట్లో ఉండడు. వేరే ఇంట్లో ఉంటాడు. ఆ ఇంట్లో ఉంటూ ఈ ఇల్లు అద్దెకిచ్చుకున్నాడు" అన్నాడు సుబ్బారావు- మురళివంక జాలిగా చూస్తూ.

"ఏమిటీ... ఇంటివాళ్ళు ఈ ఇంట్లో ఉండరా? అవునవును... ఇది ఇండిపెండెంట్ ఇల్లని ఇందాక అన్నావు కదూ! అదృష్టం అంటే ఈ ఇంట్లో ఉన్న వాళ్ళది అనాలిరా! ఎంత మంచివాళ్ళయినా, ఇంటివాళ్ళు పక్కనే ఉంటే ఎప్పుడో ఒకప్పుడు పేచీలు రాకపోవు. మగవాళ్ళు సర్దుకుపోయినా, ఆడవాళ్ళ మధ్య ఏవో కీచులాటలు వచ్చి తీరుతాయి. అటువంటిది- ఇంటివాళ్ళు ఉండరంటే సొంత ఇంటికంటే ఎక్కువగా అనుభవించవచ్చురా! ఏమి అదృష్టంరా... ఆ.... అన్నట్లూ- ఇంట్లో అద్దెకుంటోంది ఒకళ్ళేనా, లేక- ఇంకెవరైనా ఉన్నారా?"

"ఒకళ్ళేరా... ఇల్లంతా ఒకటే భాగం!"

"ఇంక చెప్పకురా బాబూ... నేను తట్టుకోలేకపోతున్నాను. నిష్కారణంగా ఈ ఇంటి సంగతి చెప్పి నా మనసంతా పాడు చేశావు కదురా!" అన్నాడు మురళి దీనంగా.

"ఒరేయ్... మీ ఇంటికంటే అధ్వాన్నంగా ఉన్న ఇళ్లతో మీ ఇంటిని పోల్చుకో. అప్పుడు అదే బ్రహ్మాండంగా ఉన్నట్లనిపిస్తుంది" అన్నాడు సుబ్బారావు నచ్చచెప్ప ప్రయత్నిస్తూ.

"ఒరేయ్.... నన్ను ఓదార్చడానికి ప్రయత్నించకురా! నా కన్ను ఈ ఇంటి మీద పడింది. ఎలాగైనా ఈ ఇంట్లో వాళ్ళని లేవగొట్టి, నేను ప్రవేశిస్తాను చూడు!" అన్నాడు మురళి శపథం పడ్తున్న వాడిలా.

"ఎందుకురా... అందని పళ్లకు అర్రులు చాచి అనవసరంగా బాధపడ్తావు?" అన్నాడు సుబ్బారావు అనునయంగా.

"అందవు- అనుకునే వాటినే అందుకుంటాడు ఈ మురళి. చూస్తూండు... నెల తిరక్కుండానే ఈ ఇంట్లోకి మారుతాను చూడు!" అన్నాడు మురళి గంభీరంగా, ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు నిశితంగా చూస్తూ.

"శుభం..! నువ్వు నా ఎదురింటికి వచ్చావంటే అంతకంటే నాకు సంతోషకరమైన దేముంటుందీ?!" అన్నాడు సుబ్బారావు.

"వస్తారా... చాలాసేపైంది. ఆలస్యంగా వెళ్తే మీ వదిన ఇంట్లోకి రానివ్వదు" అంటూ నవ్వుతూ అడుగు ముందుకు వేశాడు మురళి.

"అబ్బ... భార్య అంటే ఎంత భయం!" అంటూ మురళిని అనుసరించి అతన్ని సాగనంపి వచ్చాడు సుబ్బారావు.

* * *

ఇరవై రోజులు గడిచిపోయాయి.

ఆరోజు సాయంత్రం సుబ్బారావు ఇంటికి రాగానే "ఏవండీ... చూశారూ... ఆ ఎదురింటి నర్సమ్మగారు వాళ్ళు ఆదరాబాదరాగా ఈరోజు ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోయారు" అని వార్త చెప్పింది భార్యామణి.

సుబ్బారావు ఆశ్చర్యానికి అంతులేదు. "ఏమిటీ... ఆయనకేమైనా సడన్‌గా బదిలీ అయిందా?" అని అడిగాడు.

"లేదండీ... ఆ ఇంట్లో నర్సమ్మగారికి దయ్యాలు కనిపిస్తున్నాయిట. ఆవిడ జడుసుకుని చీటికిమాటికి జ్వరాన పడుతోందట! అందువల్ల అంత మంచి ఇంటినీ వదిలి వెళ్లిపోయారు" అంది ఆమె.

"ఇన్నాళ్లూ లేని దయ్యాలు ఇప్పుడెక్కడినుంచి వచ్చాయబ్బా! ఏమైనా మన మురళి సంకల్పసిద్ధుడు. వాడు అనుకున్నట్లుగా నెల తిరక్కుండానే ఇల్లు ఖాళీ అయింది. ఇప్పుడే పోయి వాడికి శుభవార్త చెప్పి వస్తాను. అక్కడినుండి అలా పరంధామయ్యగారింటికి వాడిని తీసుకువెళ్లి ఇల్లు ఖాయం చేసుకు వస్తా!" అన్నాడు సుబ్బారావు బట్టలు మార్చడం ఆపి.

"ఆగండి... మీ మగాళ్ళ తెలివితేటలు ఇలానే ఉంటాయి. దయ్యాల కొంపనా వాళ్ళకి అంటకట్టేది? తెలిసీ మనకీ పాపం ఎందుకండీ?! ఏమీ తెలియనట్లు ఊరుకోండి!" అందామె.

"నీ ముఖం... దయ్యాలూ లేవు, భూతాలూ లేవు. ఎవరో పనిలేనివాళ్ళు కల్పించి ఉంటారు. ఇంత మంచి ఇంటిని పోగొడ్తే వాడు నన్ను బ్రతికినంతకాలమూ తిడ్తాడు" అన్నాడు సుబ్బారావు.

"చాల్లెండి సంబరం! ఆయనకి దయ్యాలంటే నమ్మకం లేకపోవచ్చు. రేపు ఆవిడకి ఏదైనా కనిపించి జడుసుకుంటే మన ప్రాణానికి పడి ఏడవదూ?" అంది ఆమె నచ్చచెప్తూ.

"సర్లే... బాగా ఆలోచించుకుని రేపు నిర్ణయిస్తా!" అని బయటకు వెళ్లే ప్రయత్నం విరమించుకున్నాడు సుబ్బారావు.

తెల్లవారింది. ఏడు గంటలు గట్టిగా అయిందో, లేదో... సుబ్బారావు ఎదురింటి ముందు బండి ఆగింది. అందులోనుంచి ఎవరో ఆయన సామాను దింపిస్తున్నాడు.

ఆయన్ని చూసేసరికి సుబ్బారావు భార్యకి మతిపోయినంత పనయ్యింది. కంగారుగా ఇంట్లోకి వెళ్లి చేయి పుచ్చుకుని భర్తని బయటకు లాక్కొచ్చింది.

ఎదురింటి ముందు సామాను దింపిస్తున్న మనిషిని చూడగానే సుబ్బారావు నోరు తెరుచుకుపోయింది ఆశ్చర్యంతో.

కొంచెం తెప్పరిల్లి, "ఒరేయ్... మురళీ! ఓరి నీ ఇల్లు బంగారంగానూ... నువ్వేనట్రా ఈ ఇంట్లోకి వస్తోంది? నిన్ననే ఖాళీ అయింది. ఈరోజు ప్రొద్దున్నే వచ్చి నీకు చెప్దామనుకున్నాను. ఇది ఖాళీ అయిందన్న విషయం నీకెలా తెలుసురా? పరంధామయ్యగారిని ఎప్పుడు కలుసుకున్నావు? ఎప్పుడు ఖాయం చేసుకున్నావు?" అంటూ ప్రశ్నల పరంపరని వదిలాడు సుబ్బారావు.

"ఈ మురళి అంటే ఏమిటనుకున్నావు? ఆనాడే చెప్పానా... నెల తిరక్కుండానే ఈ ఇంట్లోకి వస్తానని! వచ్చేశాను... ఇప్పుడేమంటావు?" అన్నాడు మురళి విజయగర్వంతో.

"ఏమంటాను..? చాలా సంతోషమంటాను. అదిసరే... దీన్ని ఎలా సాధించావురా?" అన్నాడు సుబ్బారావు కుతూహలంతో.

"అమ్మమ్మ... అది చెప్తే ఎలా?, అది ట్రేడ్ సీక్రెట్... ఎవ్వరికీ చెప్పకూడదు" అన్నాడు మురళి కవ్విస్తూ.

"ఒరేయ్... నా దగ్గర కూడా రహస్యమేనా?" అన్నాడు సుబ్బారావు మూతి ముడుచుకుని.

"చెప్తాలేరా... నీక్కాకపోతే ఎవరికి చెప్తాను?! ముందు సామానునీ, ఆ తర్వాత సంసారాన్నీ చేర్చి కాస్త స్తిమిత పడనీ!" అంటూ సుబ్బారావు భుజంతట్టూ మాట దాటేశాడు మురళి.

* * *

ఆ తర్వాత ఒక వారం రోజులపాటు ఆఫీసులో పని ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో సుబ్బారావు మురళితో మాట్లాడలేకపోయాడు. ఎవరో దగ్గర బంధువులు రావడం, వారితో తిరగవలసి రావడంతో ఇంటికి వచ్చాక కూడా మురళిని కలవడం కుదరలేదు. 'అంత మంచి ఇంటిని అంత స్వల్ప వ్యవధిలో మురళి ఎలా సాధించాడు?' అన్న ప్రశ్న- ప్రశ్నగానే మిగిలిపోయింది సుబ్బారావుకి.

సుబ్బారావు బంధువులంతా వెళ్లిపోయారు. ప్రొద్దున వాళ్ళని పంపించి, అటునుంచి అటే ఆఫీసుకి వెళ్లాడు.

మురళిని కలుసుకుందామని వాళ్ళ సెక్షనుకు వెళ్లాడు. అతను మూడు రోజులు సెలవు పెట్టాడని తెలిసింది. 'తనకి కూడా చెప్పకుండా సెలవు ఎందుకు పెట్టాడబ్బా...' అనిపించింది సుబ్బారావుకి.

సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి భార్యామణి ఆత్రంగా ఎదురుచూస్తోంది.

అతను కాళ్లైనా కడుక్కోకుండానే, బట్టలైనా మార్చుకోకుండానే-

"ఈ విషయం విన్నారా?" అంది భార్యామణి.

'అంత ముఖ్యమైన విషయం ఏమైయ్యుంటుందబ్బా...' అనుకుంటూ ప్రశ్నార్థకంగా ఆమెవంక చూశాడు సుబ్బారావు.

"మీ స్నేహితుడు మురళి భార్యకి రోజూ దయ్యాలు కనిపిస్తున్నాయట. మంచం పట్టిందట!" అంది ఆమె కళ్లు పెద్దవి చేసుకుని.

"వాళ్ళు వచ్చి పట్టుమని పదిరోజులు కాలేదు. అప్పుడే దయ్యాలూ, భూతాలూ కనిపిస్తున్నాయా? ఎవరు చెప్పారు నీకీ సొల్లు కబుర్లు?" అన్నాడు సుబ్బారావు చిరాగ్గా.

"మన పనిమనిషి చెప్పింది. అదేగా వాళ్ళింట్లో కూడా పని చేసేది! అయినా... దయ్యాలు కనిపించడానికి పదిరోజులు కావాలా? దయ్యాలు ఆ ఇంట్లో తిరుగాడుతున్నప్పుడు- వచ్చినప్పటినుంచి కనిపించవచ్చు. ఇంకానయం- ఆ ఇల్లు మీరు కుదిర్చారు కాదు.., మన ప్రాణానికి పడి ఏడ్చేవాళ్ళు!" అంది ఆమె.

"ఆపు నీ సొద! ఇప్పుడే సుబ్బారావు ఇంటికి వెళ్లి సంగతేమిటో కనుక్కొని వస్తా..." అంటూ బయటకు వెళ్లబోయాడు సుబ్బారావు.

"వాళ్ళు లేరు. మామూలు మందులు పనిచేయడం లేదని పొరుగూరులో ఉన్న భూతవైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లారు ప్రొద్దునే. రాత్రి బాగా పొద్దుపోయాక కాని తిరిగి రారు" అంది భార్య.

"అందుకా మురళి సెలవు పెట్టింది! సరే... రేపు ప్రొద్దున్నే వెళ్లి సంగతేమిటో తెలుసుకు వస్తా!" అంటూ కాళ్లూ, ముఖం కడుక్కోడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు సుబ్బారావు.

* * *

ప్రొద్దున లేచి కాలకృత్యాలు తీర్చుకునేసరికి 7:30 అయింది.

మురళి ఇంటికి వెళ్దామని బయలుదేరాడు. గడప దాటి ఒక అడుగు వేశాడో, లేదో... కనిపించిన దృశ్యం చూసి కొయ్యబారిపోయాడు.

ఎదురుగా మురళి ఇంటిముందు బండి ఆగి ఉంది. అందులోకి మురళి, అతని కొడుకు కలిసి సామాను ఎక్కిస్తున్నారు.

కంగారుగా మురళి దగ్గరకు వెళ్లాడు సుబ్బారావు.

అతన్ని చూడగానే తల దించుకున్నాడు మురళి.

"మురళీ... ఏమిటిదంతా? అసలేం జరిగింది? నేను విన్నది నిజమేనా?" అంటూ ఆదుర్దాగా ప్రశ్నలు వేశాడు సుబ్బారావు.

ప్రశ్నార్థకంగా చూశాడు మురళి.

"అదే... మీ ఆవిడ ఏవో దయ్యాలను చూసి ఝడుసుకుందనీ, జ్వరం వచ్చిందనీ, తగ్గడం లేదనీ..."

"నిజమే..!" అన్నాడు మురళి.

"నాకేమీ అర్థంకావడం లేదు."

"బండి నిండిపోవచ్చింది. బండి వెంట మా అబ్బాయి వెళ్లి సామాను దించి వస్తాడు. వాడు వెళ్లగానే చెప్తాను" అన్నాడుూమురళి.

మరో పది నిమిషాలలో సామాను నిండిన బండి వెంట మురళి కొడుకు వెళ్లాడు.

"అసలేం జరిగింది మురళీ?" అనునయంగా అడిగాడు సుబ్బారావు.

"మనం డాబా మీదికి పోయి మాట్లాడుకుందాం!" అంటూ బయటి మెట్ల వైపు దారితీశాడు మురళి. సుబ్బారావు వెంట వెళ్లాడు.

ఇద్దరూ డాబా పైన పిట్టగోడ మీద కూర్చున్నారు.

కొంచెంసేపు ఇద్దరూ మౌనంగానే ఉన్నారు.

"చెప్పు మురళీ! అసలేం జరిగింది?" అన్నాడు సుబ్బారావు.

మురళికి ఏడుపు రావడమొక్కటే తరువాయి. కళ్లు తుడుచుకుంటూ- "చెప్తాను. ఆప్తమిత్రుడివి... నీకు కాకపోతే ఇంకెవరికి చెప్తాను?! చేసిన పాపం చెప్తే పోతుందంటారు. నా పాపం చెప్పినా పోదు" అంటూ ఒక్కక్షణం ఆగాడు మురళి.

బరువుగా నిట్టూర్చి, చెప్పడం మొదలుపెట్టాడు-

"నెల రోజులు తిరక్కుండా ఈ ఇంట్లోకి వస్తాను చూడు'- అని నీతో ఛాలెంజ్ చేసి వెళ్లానా! అప్పటినుంచి దానిని ఎలా సాధించాలా... అన్న ఆలోచనే నా మెదడును తొలుస్తూ ఉండింది. దానికి ఒక పథకం ఆలోచించాను. దానిని అమలుచేసేలోగా పరంధామయ్యగారు ఎక్కడుండేదీ తెలుసుకుని, రెండు మూడుసార్లు ఆయన్ని కలుసుకుని పరిచయం పెంచుకున్నాను. తర్వాత ఓరోజు మా ఆవిడ దగ్గర నీ ప్రస్తావన తెచ్చి, కావాలని- మీ ఇంటిముందు చూసిన 'ఆ అందమైన ఇల్లు దయ్యాల కొంప అనీ, అందుకే పరంధామయ్యగారు తాను అందులో ఉండకుండా చవగ్గా అద్దెకిచ్చారట' అని చెప్పాను. ఈ మాటల్ని మా ఇంట్లో పనిమనిషి ఉన్న సమయం చూసి అది వినేట్లు చెప్పాను. అది ఉండేది ఈ ఇళ్ల దగ్గరే!

ఇంకేముందీ- అసలే అది ఆకాశవాణిని మించినది. వెంటనే ఈ వార్తను చిలవలు పలవలు కలిపి ప్రచారం చేసింది. వారం తిరక్కుండానే ఈ పుకార్లు దావానలంలా

వ్యాపించాయి. అయితే... పరంధామయ్యగారు దూరాన ఉండడంతో ఆయనదాకా అవి పోలేదు. పుకార్ల షికార్లు ఎక్కువ కావడంతో ఈ ఇంట్లో అద్దెకుంటున్న ఆయన భార్యకి నిజంగా దయ్యాల్ని చూసిన భ్రమలు కలగసాగాయి. అవి అంతకంతకూ బలీయమై ఆవిడ మంచం పట్టింది. ఏ మందుకీ ఆవిడకి తగ్గకపోవడంతో- ఆ ఇల్లు ఖాళీ చేస్తేనే కాని ఆవిడకి నయం కాదని భావించి వాళ్లు ఇల్లు ఖాళీ చేయడానికి నిశ్చయించుకున్నారు. ఈ వ్యవహారాన్ని జాగ్రత్తగా గమనిస్తూ సమయానికి పరంధామయ్యగారిని కలిసి ఈ ఇంటిని నాకు అద్దెకు ఇచ్చేటట్లు చూసుకున్నాను" అని ఆగాడు మురళి.

"మరి... ఇదంతా కట్టుకథ అయినప్పుడు- ఆ దయ్యాలు మీ ఆవిడకి కనిపించడమేమిటి? ఆవిడ భయపడి మంచమెక్కడ మేమిటి?" అన్నాడు సుబ్బారావు.

"నేను చేసిన వెధవ పనిని నేను మా ఆవిడకి కాని, పిల్లలకి కాని చెప్పలేదు. అటువంటిది ఎలా చెప్తాను?

మేము చేరిన రెండు మూడురోజుల నుంచే ఇరుగుపొరుగు అమ్మలక్కలు ముక్కుల మీద వేళ్లేసుకుని, 'ఇదేమిటమ్మా... దయ్యాల కొంపలోకి ప్రవేశించారు? మీకు వేరే ఇళ్లేమీ దొరకలేదా?' అంటూ ఒకరు.., 'పాతవాళ్ళు ఎందుకు ఖాళీ చేశారనుకున్నారు? దయ్యాల బాధ పడలేకే!' అని ఇంకొకరు.., 'పరంధామయ్యగారు చాలా తెలివిగలవాడు. అందుకే మంచి ఇల్లు కట్టినా, అది దయ్యాల కొంప అని తెలిసి తాను ఉండకుండా అద్దెకిచ్చాడు. అది దయ్యాల కొంప కాకపోతే- ఇంత మంచి సెంటర్లో ఉన్న ఇంత మంచి ఇంటిని అంత తక్కువ అద్దెకు ఇస్తాడా?' అని మరొకరు- ఇలా బ్రెయిన్ వాష్ చేయడంతో మా ఆవిడకీ ఈ ఇల్లు 'దయ్యాల కొంప' అన్న నమ్మకం ఏర్పడింది. ఎప్పుడైతే మనసులో అనుమానం మొలకెత్తిందో... ఆమెకి నిజంగానే దయ్యాలు కనిపించసాగాయి.

అంతే... చీటికిమాటికి జ్వరం పడడం, పిచ్చి చూపులు, పిచ్చి చేష్టలు- చూస్తూండగానే మంచానికి అతుక్కుపోయింది. ఏ మందులు ఇప్పించినా తగ్గడం లేదు" అన్నాడు మురళి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

"పోనీ.., తర్వాతనైనా ఆమెకి నిజం చెప్పలేకపోయావా? ఇదంతా ఈ ఇల్లు సంపాదించడం కోసం నువ్వాడిన నాటకం అనీ, దయ్యాలు వట్టి కట్టుకథనీ?!"

"చెప్పాను. కాని, ఆవిడ నమ్మడం లేదు. ఇంత మంచి ఇల్లు వదులుకోవడం ఇష్టంలేక నేను కావాలని కట్టుకథ ఆవిడకి చెప్పానని అంటుంది. ఈ ఇంట్లో ఉంటే దయ్యాలు తనని చంపివేస్తాయనీ, ఇల్లు ఖాళీ చేస్తేనే తాను బతుకుతానని తెగేసి చెప్తోంది."

"మరి, నిన్న ఎవరో భూత వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్లావట!"

"నిజమే..! భూత వైద్యుడి చేత పూజలూ, శాంతులు చేయించి అతని చేత- 'దయ్యాలు పోయాయి. ఇంక నీ జోలికి రావు' అని అనిపిస్తే ఈవిడ భయం పోయి ఇక్కడే ఉందామంటుందేమో ననుకున్నాను. కాని, చేతి చమురు వదిలింది కాని, ఫలితం దక్కలేదు."

"ఏం జరిగింది?"

"ఇంటికి వచ్చాక కాళ్లు కడుక్కోడానికి బాత్‌రూమ్‌కి వెళ్లింది. అక్కడేదో దయ్యం కనిపించిందట! పెద్ద కేక వేసి స్పృహతప్పి పడిపోయింది. సపర్యలు చేశాక అరగంటకి కాని తెలివి రాలేదు."

"అంటే... ఆవిడకి దయ్యాలు పోయాయన్న నమ్మకం కలగలేదన్నమాట!"

"అవును. అందుకే... రాత్రి పదింటికి పరంధామయ్యగారింటికి వెళ్లి ఏదో సాకు చెప్పి ఈరోజు ఇల్లు ఖాళీ చేస్తున్నానని చెప్పాను."

"అలాగే నేను ఖాళీ చేసిన ఇంటి యజమాని దగ్గరికి వెళ్లాను."

"అది ఇంకా ఖాళీగా ఉందా?"

"ఉంది. మళ్లీ ఆ ఇంట్లోకి వస్తానన్నాను."

"మరి.., ఇచ్చాడా?"

"ఇచ్చాడు. కాకపోతే... ఒక వంద అద్దె పెంచాడు. చేసిన పాపానికి అది పెనాల్టీ అనుకుని ఒప్పుకున్నాను" అన్నాడు మురళి కళ్లు తుడుచుకుంటూ.

- ఆంధ్రప్రభ వార పత్రిక... *30 అక్టోబర్ '96*

<u>**క్విక్ డెలివరీ**</u>

ఒక ప్రముఖ నటి షాపింగ్‌కి వెళ్లి కావలసిన చీరలు వగైరాలకు ఆర్డరిచ్చింది. ఎన్నాళ్లకీ అవి ఇంటికి రాకపోయేసరికి.., షాపువారికి ఉత్తరం రాసింది-

"మీ బట్టల డెలివరీకంటే నా డెలివరీయే ముందయి పోయింది కనుక నా ఆర్డర్ కాన్సిల్ చేయండి" అని.

